క్లుప్తంగా

పెద్దాసుపత్రి ఇన్ గేట్ ప్రారంభం



గేటును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఇన్ గేటును సోమవారం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఇన్, అవుట్ రెండు గేట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే ఆసుపత్రికి వచ్చే వారు వాహనాలను పార్కింగ్ చేసేందుకు లొకేషన్‌లను గుర్తించినట్లు తెలిపారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరం



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

కర్నూలు సిటీ: స్థానిక గణేష్ నగర్‌లోని హారిజోన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం వేసవి విరామ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలను స్కూల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ ప్రారంభించి ప్రసంగించారు. తమ విద్యాసంస్థలో లండన్ కేంబ్రిడ్జ్ వారిచే గుర్తింపు పొందిన వారి సలహాలు, సూచనలతో చిన్నారులకు మానసిక వికాసం పెంపొందించేందుకు తగిన రీతిలో బోధన చేయిస్తున్నామన్నారు. ఆటపాటల ద్వారా పిల్లలకు బోధన చేస్తుండడంతో వారు సులువుగా నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వేసవి విరామ తరగతుల్లో పిల్లలకు డ్యాన్స్, చిత్రలేఖనం, పాటింగ్(కుండలు తయారు చేయడం) తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. స్కూల్ డైరెక్టర్ పావని, తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో నైతిక విలువలు పెరగాలి



ప్రవచనం చెబుతున్న గరికపాటి నరసింహారావు

కర్నూలు కల్చరల్: విద్యా విధానంలో నైతిక విలువలు పెరగాలని, భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత పెరుగుతుందని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. రైతు చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం టీజీవీ కళాక్షేత్రంలో రైతు చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గరికపాటి సందేశమిచ్చారు. రైతులకు సబ్సిడీలకన్నా గిట్టుబాటు ధర కల్పిస్తే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోవడానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడమే ప్రధాన కారణమన్నారు. ఎంత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వచ్చినా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత తగ్గదన్నారు. అంతకుముందు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య గరికపాటిని ఘనంగా సన్మానించారు. వేదిక ప్రతినిధులు పద్మశ్రీ చింతల వెంకట రెడ్డి, బొల్లవరం వీర రాఘవరెడ్డి, టీఎంసీసీఐ ప్రతినిధి గంజి జగన్‌బాబు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

ఓర్వకల్లు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కాల్వబుగ్గ సమీపంలో సోమవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామానికి చెందిన కె.రుష్వి పాణ్యం దగ్గర గల ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి రోజు బైక్‌పై కాలేజీకి వెళ్లేవాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం కాలేజీకి వెళ్లి వస్తుండగా కాల్వబుగ్గ సమీపంలోని యుటర్న్ వద్ద డీఆర్‌డీఓలో విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి వేగంగా బైక్‌పై వస్తూ ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. అదేవిధంగా కర్నూలు నుంచి నంద్యాల వైపు కారులో వెళ్లుతున్న కొందరు వ్యక్తులు కాల్వబుగ్గ వద్ద కొబ్బరిబొండాలు తాగేందుకు రోడ్డు పక్కన కారును ఆపుకున్నారు. అదే సమయంలో కర్నూలు వైపు నుంచి విధుల నిమిత్తం రామచంద్ర గౌడు అనే పోలీసు హెడ్ కానిస్టేబుల్ తన రాయల్ ఎన్‌ఫీల్డు (బుల్లెట్) వాహనంపై బేతంచెర్లకు వెళ్తున్నాడు. ఆదమరిచి ఆగిఉన్న కారును ఢీ కొనగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. క్షతగాత్రులను అంబులెన్స్ వాహనాల్లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో విద్యార్థి రుష్వి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

కూడళ్లలో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి

- శ్రీనివాసనగర్‌లో కుక్కల బెడద సమస్యను పరిష్కరించండి
- కమిషనర్‌కు పలువురు వినతులు

కర్నూలు (టౌన్): నగరంలోని ముఖ్య కూడళ్లలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష, శ్రీనివాసులు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలోని పలువురు తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతులు సమర్పించారు. ప్రజలు అర్జీల రూపంలో లేవనెత్తిన సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

సమస్యలు ఇవే..

- నగరంలోని శ్రీనివాసనగర్‌లో కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు దాసన్న ఫిర్యాదు చేశారు.
- ఎఫ్‌సీఐ కాలనీ-1 లో వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు.
- జొహరాపురం ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు వెంకటరమణ కోరారు.
- ఏ.క్యాంపులోని భరత్ నగర్‌లో డ్రైనేజీ కాల్వలు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని స్థానిక కాలనీ వాసులు సుభాషిణీ, సరోజమ్మ, సుశీలమ్మ విన్నవించారు.
- కృష్ణనగర్ ఐటీసీ వద్ద ఓపెన్ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని సంకల్ప సాయి స్వామినగర్ వాసులు రామకోటయ్య, శివప్రసాద్ విన్నవించారు.
- ఈనెల 7వ తేదీ బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈద్గాల్లో పరిశుభ్రత పనులు చేపట్టాలని మన్సూర్ బాష, అబ్బాస్ అభ్యర్థించారు.



కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష

అరుదైన గుండె ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్): గుండెలో మూడు రక్తనాళాలు మూసుకుపోయిన వ్యక్తికి కర్నూలు అమీలియో హాస్పిటల్ వైద్యులు ఆపరేషన్ చేసి ప్రాణం పోశారు. వివరాలను హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ చాపే, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ బావాజీ కొండూరి వివరించారు. దేవనకొండ మండలానికి చెందిన పి.కౌలుట్లమ్మ (45) అనే మహిళ పదేళ్లుగా గుండె సమస్యతో బాధపడుతోందన్నారు. క్రానిక్ రుమాటిక్ హార్ట్ వ్యాధి ఉన్నట్లు వైద్యపరీక్షల్లో నిర్ధారించామన్నారు. ఆమె గుండెలో మూడు వాల్వ్‌లు మూసుకుపోయినట్లు తెలుసుకున్నట్లు వివరించారు. గత నెల 25న ఆమెకు 8 గంటల పాటు శ్రమించి ఆరోగ్యశ్రీ కింద గుండె ఆపరేషన్ చేశామన్నారు. కార్డియో పల్మనరీ బైపాస్ చేసిన తర్వాత గుండెకు మూడు వాల్వ్‌లు కృత్రిమంగా అమర్చినట్లు చెప్పారు. ఇందుకు అనస్తీషియా వైద్యులు అనిల్‌కుమార్, సిబ్బంది సహకరించారన్నారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆలిండియా బీఎస్ఎన్ఎల్-డాట్ పెన్షనర్స్ అసోసియేషన్, కర్నూలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ కేంద్ర శాఖ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. 2020 జనవరి 31న వీఆర్ఎస్ తీసుకున్న అధికారులు, సిబ్బందిలో ఉన్న ఎస్టీకి సంబంధించిన వారి విషయంలో నిబంధనలకు విరుద్ధంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారికి రావాల్సిన పెన్షనరీ బెనిఫిట్స్ ఐదేళ్ల తర్వాత కూడా చెల్లించడం లేదన్నారు. గ్రాట్యుటీ, కమ్యూటెడ్ వాల్యూ ఆఫ్ పెన్షన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డాట్ ఇచ్చిన ఆర్డర్లను అమలు చేయాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, జిల్లా కార్యదర్శి జి.ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా సొంతిల్లు లేని పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి స్థలాన్ని వెంటనే మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.లెనిన్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మునెప్ప నేతృత్వంలోని బృందం, కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట లెనిన్‌బాబు ఆధ్వర్యంలోని బృందం ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు, తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలు ఒక్కొక్కరికి రూ.15 వేలు, నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇవ్వాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరారు. నాయకులు దంబోళ శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనపై చిత్తశుద్ధి లేని ప్రజాప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న వాల్మీకి నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధనపై ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని వాల్మీకి నేతలు తీవ్రంగా విమర్శించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో హైకోర్టు న్యాయవాది సూర్యనారాయణ, నాయకులు కుబేర స్వామి, తలారి క్రిష్టుడు, కొల్లాయి పెద్దయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కేవలం ప్రకటనలు ఇవ్వడం మాని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలన్నారు. కేంద్ర ఎస్టీ కమిషన్ వద్ద ఉన్న ఫైల్‌ను కదిలించాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షాతో మాట్లాడి ఎస్టీ రిజర్వేషన్ సాధనకు కృషి చేయాలన్నారు. వాల్మీకులను తప్పుదోవ పట్టించే విధంగా ఉద్యమాలు చేద్దాం రండి అని మోసపూరిత ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయం ఆదోని ఎమ్మెల్యేకు తెలియదా? అని ప్రశ్నించారు. వాల్మీకి సామాజికవర్గం బలంతో పదవులు పొందిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ ఎన్‌డీఏ కూటమిపై ఒత్తిడి పెంచడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు వాల్మీకి జాతి అసహనానికి గురి కాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు విష్ణు, హరిప్రసాద్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ డ్యూయల్ మేజర్ కోర్సులతో మరిన్ని అవకాశాలు



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్: డిగ్రీ కోర్సులను సింగిల్ మేజర్ కోర్సుల నుంచి డ్యూయల్ (రెండు) మేజర్ కోర్సులుగా మార్చడంతో విద్యార్థులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అన్నారు. సోమవారం వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంలో వీసీ డ్యూయల్ మేజర్ కోర్సుల గురించి వివరించారు. డ్యూయల్ మేజర్ సబ్జెక్టులుగా కళాశాలలు అందించే కోర్సులకు ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 7వ తేదీలోగా రూ.5 వేలు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదనపు రుసుంతో 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి డ్యూయల్ మేజర్ విధానానికి మారనున్న డిగ్రీ కోర్సులకు సంబంధించిన విధివిధానాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పీవీ సుందరానంద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ సర్కిల్ ఏర్పాటుపై హర్షం

కల్లూరు: నగరంలోని ఉల్చాల రోడ్డులోని వై.జంక్షన్‌ను ఛత్రపతి శివాజీ మహారాజ్ సర్కిల్‌గా మున్సిపల్ కౌన్సిల్‌లో నామకరణం చేయడంపై మరాఠ సేవా సమితి, హిందూ ధర్మరక్షకులు, ధార్మిక సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. సోమవారం విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు ప్రతాపరెడ్డి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని కలిసి శివాజీ మహారాజ్ జయంతి నాటికి ఆ సర్కిల్‌లో శాశ్వత విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. కార్యక్రమంలో మరాఠ సేవా సమితి నాయకులు బాలాజీరావు, గంగారాం, హిందూ ధర్మరక్షకులు శివప్రసాద్, మధు, వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ శివారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు (అర్బన్): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ శివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. తాగునీటి సదుపాయం, గదులలో లైట్లు, ఫ్యాన్లు, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, పుస్తకాలు, దుస్తులు సకాలంలో అందించాలని, గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మంది విద్యార్థులు ఉండి హాస్టల్‌లో సీట్లు ఇవ్వలేని పరిస్థితులు ఉంటే మరో హాస్టల్‌ను నంబర్ - 2 పేరుతో ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు ఎస్.అభి, నగర నాయకులు కృష్ణ, కుశ్వంత్, మను తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కర్నూలు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కర్నూలు ఎక్సైజ్ అధికారులు సోమవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణ, కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్, ఎస్ఐలు మధుసూదన్, ఇంద్రకిరణ్ తేజ, సిబ్బంది ఈరన్న, రాజు, మధు బృందాలుగా ఏర్పడి సోమవారం కర్నూలులోని బంగారుపేటతో పాటు ఓర్వకల్లు మండలం గుడుంబాయి తాండా, గుమ్మితం తాండాలలో నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. బంగారుపేటలో సుమారు 1100 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊట, 110 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసి సారా విక్రయాలు జరుపుతున్న చాకలి రాధ, నీలిషికారి రుక్మిణి, నీలిషికారి సుగుణను అరెస్టు చేసి వారి వద్ద 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు. అలాగే గుమ్మితం తాండాలో నాటుసారాకు ఉపయోగించే 1100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

జాతీయస్థాయి హాకీ క్రీడాకారుడి మృతి



కరుణ్‌కుమార్ (ఫైల్)

కర్నూలు (టౌన్): హాకీ క్రీడాంశంలో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కరుణ్‌కుమార్ (64) గుండె పోటుతో సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ జట్టు తరపున 7 సార్లు సీనియర్స్‌విభాగంలో జాతీయస్థాయి హాకీ పోటీల్లో రాణించారు. హాకీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక విజయాల్లో కీలకంగా వ్యవహరించారు. హాకీ ఇండియా అసోసియేషన్‌కు జిల్లా కార్యదర్శిగా పని చేశారు. ఎంతో మంది హాకీ క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేశారు.

క్రీడా సంఘాల నివాళి

హాకీ క్రీడాకారుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న క్రీడా సంఘాల ప్రతినిధులు సోమవారం ఈసీఎం కాంపౌండ్‌లో నివసిస్తున్న కరుణ్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడా సంఘాల ప్రతినిధులు దాసరి సుధీర్, ప్రవీణ్ వేణుగోపాల్, చిన్న సుంకన్న, శ్రీనివాసులు, సత్యకుమార్, శాంతి, పరశురాముడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల గడువు పొడిగింపుతో పైరవీలకు అవకాశం

- ప్రక్రియ కొలిక్కి వచ్చిన తరుణంలో పొడిగింపుపై సర్వత్రా ఆందోళన
- కూటమి నేతలకు లబ్ధి చేకూర్చేందుకే అంటూ విమర్శలు
- తమవి అనుకున్న స్థానాలు తారుమారు అయ్యే ప్రమాదం

కర్నూలు(అగ్రికల్చర్): బదిలీల ప్రక్రియను కూటమి ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. పైరవీలు, రాజకీయ సిఫారసులను మరింత పెంచడం కోసమే గడువును పొడిగించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు అన్ని శాఖల్లో బదిలీలు ఒక కొలిక్కి వచ్చాయి. 2వ తేదీ అర్ధరాత్రి తర్వాత బదిలీ ఉత్తర్వులు జారీ చేయడానికి అన్ని శాఖలు సిద్ధమయ్యాయి. బదిలీల గడువు పొడిగించాలని ఏ ఉద్యోగ సంఘం కూడా ప్రభుత్వాన్ని కోరిన దాఖలాలు లేవు. ఈ స్థితిలో వారం రోజుల పాటు గడువును పొడిగించారంటే పైరవీలను ప్రోత్సహించడమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, సేట్ ఆడిట్, మార్కెటింగ్ శాఖ, డీఆర్‌డీఏ తదితర శాఖల్లో రాజకీయ ప్రమేయం పెరిగింది. రాజకీయ సిఫారసు లేకుండా బదిలీలు జరుగుతున్న దాఖలాలు లేవు. కూటమి పార్టీల నేతలకు బదిలీలు ఆదాయ వనరుగా మారాయి. మేము చెప్పిన పనులు యథాతథంగా చేయాలి. వైఎస్సార్‌సీపీ వారికి ఎలాంటి పనులు చేయరాదనే షరతులతో సిఫారసు లెటర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కల్లూరు, ఎమ్మిగనూరు, ఆదోని మండల వ్యవసాయ అధికారి పోస్టులకు కూటమి పార్టీల నేతలకు రూ.లక్షలు ఇచ్చుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏదో విధంగా పోస్టు దక్కించుకున్నాం. ఆర్డర్ రావడమే తరువాయి అనుకునే సమయంలో గడువును వారం రోజుల పాటు పొడిగించడం వల్ల పైరవీలు పెరిగి మార్పులు, చేర్పులు జరిగే ప్రమాదం ఏర్పడింది. రాజకీయ సిఫార్సు లేకుండా ఒక్కటంటే ఒక్క బదిలీ కూడా జరిగే పరిస్థితి లేదు. బలం ఉన్నోడిదే రాజ్యం అన్నట్లుగా.. రాజకీయ పరపతి, డబ్బు బలం ఉన్నవారికి కీలక పోస్టులు దక్కే పరిస్థితి ఏర్పడింది. బదిలీలకు ఈ నెల 9వ తేదీ వరకు అవకాశం కల్పించడంతో పైరవీలు పెరుగుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉద్యోగ సంఘాలు మరింత చెలరేగే పరిస్థితి ఏర్పడింది. బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలనుకుంటే గడువు పొడిగించే అవకాశం ఉండదు. గడువు పొడిగించడం అంటే అవినీతి, అక్రమాలను ప్రోత్సహించడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

యోగాంధ్రలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ పాఠశాల మైదానంలో మెప్మా విభాగం ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు యోగాంధ్ర చైతన్య ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జె.స్వప్న (ప్రథమ), ఎస్.రాజేశ్వరీ (ద్వితీయ) జి.భావన (తృతీయ)కు కమిషనర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ జీవితంలో యోగాను ఓ భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకట లక్ష్మి, టౌన్ మెప్మా ప్రాజెక్టు మిషన్ అధికారి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంకర పాదాలను నిర్లక్ష్యం చేయొద్దు



పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న డాక్టర్ శ్రీరాములు

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో వంకర పాదాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు చెప్పారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో ప్రపంచ క్లబ్ ఫుట్(వంకర పాదాలు) దినోత్సవం పురస్కరించుకుని సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డైస్)లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ.. వంకర పాదాలతో జన్మించే చిన్నారులకు ఎలాంటి వైద్య సేవలు, శస్త్రచికిత్సలు నిర్వహించవచ్చనే విషయాలపై అవగాహన కల్పించారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మాట్లాడుతూ.. పుట్టుకతో వచ్చే ఈ సమస్యను త్వరగా గుర్తిస్తే సర్జరీతో గానీ, సర్జరీ లేకుండా గానీ తగ్గించుకోవచ్చన్నారు. పిల్లలు నడుస్తున్నప్పుడు ఇబ్బంది పడటం, తరచుగా పడిపోవడం, పరిగెత్తడంలో ఇబ్బంది ఉంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఆనంద్ ప్రకాష్, రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్, ఎన్‌సీడీ ఇన్‌చార్జ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ వారు వంకర పాదాల పిల్లలకు ఉచితంగా వైద్యం అందిస్తారని, బూట్లు కూడా ఉచితంగా ఇస్తారని చెప్పారు. వైద్య సేవలు అవసరమైన వారు కర్నూలు హెల్ప్‌లైన్ క్యూర్ ఇండియా కౌన్సిలర్ రేష్మ (8800015588), ఏపీ హెల్ప్‌లైన్ (8800020503) నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. చిన్నపిల్లల వైద్యులు సృజన, ఫిజియోథెరపిస్ట్ ప్రవీణ, మేనేజర్ ఇర్ఫాన్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ కాలేజీ డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి, తదితరులు



ఎస్.మేఘన



ఆర్.ఉపేంద్ర రెడ్డి



పి.అభిషేక్ నాయక్



డి.దీప్తి

కర్నూలు సిటీ: దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బీటెక్, బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో గత నెల 18వ తేదీన నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఐఐటీ కాన్పూర్ పరీక్ష నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. పరీక్షకు ఉమ్మడి జిల్లాలో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సనత్‌నగర్ అయాన్ డిజిటల్, నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 700 మంది పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించారు. నేటి (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు జోసా(జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ-జేఓఎస్ఏఏ) కౌన్సెలింగ్ ప్రారంభించనున్నారు.

- జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో తమ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు నారాయణ జూనియర్ కాలేజీల డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆ కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కాలేజీకి చెందిన కె.జీవన్‌కుమార్ ఆలిండియా ఓపెన్‌లో 889వ ర్యాంకు, కేటగిరీలో 143వ ర్యాంకు, పి.జశ్వంత్ నాయక్ క్యాటగిరీ ర్యాంకు - 174, ఓపెన్ కేటగిరీలో 19,411వ ర్యాంకు, టి.మిథున్ సాయికుమార్ కేటగిరీలో 1221వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 6015వ ర్యాంకు, ఎ.మణిదీప్ 1817వ కేటగిరీ ర్యాంకు, ఎస్.సాయి మానసగౌడ్ 2893వ కేటగిరీ ర్యాంకు, ఓపెన్ కేటగిరీ ర్యాంకు 12176వ ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు వివిధ కేటగిరీల్లో చరణ్‌కుమార్ 3433వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 13,892వ ర్యాంకు, వై.సాహితి 3364వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో సాయి శ్రుతి 6124వ ర్యాంకు, సాయి భాస్కర్ 9298, ఎన్.హర్షిత 12007వ ర్యాంకు, శివధనుష్‌కు 15,051వ ర్యాంకు వచ్చిందన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. డీన్ డి.వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు విజయ మోహన్, వెంకటరాముడు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.
- జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ కాలేజీల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తమ విద్యార్థులు ఎస్.మేఘన 964వ ర్యాంకు, ఆర్.ఉపేంద్ర రెడ్డి 1841వ ర్యాంకు, పి.అభిషేక్ నాయక్ 2048వ ర్యాంకు, జి.దీప్తి 2882వ ర్యాంకు, డి.జోయల్ అభినయ్ 4176వ ర్యాంకు, ఎం.జీవన్‌కుమార్ 5714వ, సి.సాయి ఐశ్వర్య 6397వ ర్యాంకు, కె.శ్రీలక్ష్మీ 8294వ ర్యాంకు, వెంకట విశాల్ 9741వ ర్యాంకు, సి.నావినేష్ నాథ్ 10,069, కె.మోక్షిత్ సాయి 10,069వ ర్యాంకు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. ఆ విద్యాసంస్థల డీన్ సరళ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.